సాక్షి తిరుపతి

గురువారం । 24 । అక్టోబర్ । 2024




పాత నేరస్తుడు అరెస్టు

విలాసాలకు అలవాటు పడి చోరీలు వృత్తిగా ఎంచుకున్న పాత నేరస్తుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. - 8లో



విద్యల్లో వేదవిద్య ఉన్నతం

అన్ని విద్యల్లో కన్నా వేదవిద్య ఉన్నతమైనదని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. - 8లో



ఇంకెన్ని చావులు చూడాలి?

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుకాసురుల దాహానికి మరో రెండు ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. - 8లో

న్యూస్‌రీల్

చట్ట పరిధిలో సహకార ఎన్నికలు



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి లక్ష్మి

తిరుపతి అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి చట్టపరిధిలోనే ఎన్నికలు జరుగుతాయని జిల్లా సహకార అధికారి లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అందరూ నియమావళిని పాటించాలన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణం మాట్లాడుతూ ఎన్నికల నియమ, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల అధికారి ఉమాపతి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. తిరుమల ఎస్వీ హైస్కూ ల్‌లో 10 పోలింగ్ బూత్‌లు, తిరుపతి గోవిందరాజస్వామి హైస్కూలులోని పోలింగ్ కేంద్రంలో 14 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. పోటీలో 35 మంది అభ్యర్థులున్నారని పేర్కొన్నారు. 6,349 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ మద్దిపట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్



ప్రదర్శనను తిలకిస్తున్న గురుకులాల జిల్లా అధికారి పద్మజ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గురుకులాల తిరుపతి, చిత్తూరు జిల్లా డీసీఓ పద్మజ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లాలోని 10 గురుకులాలకు చెందిన విద్యార్థులు 166 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో జడ్జిలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు వ్యవహరించి, సైన్స్‌ఫేర్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో నలుగురు విజేతలను ఎంపిక చేసి, అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దాదాఫీర్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌రఫీ, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో ఎల్జీ పాలిమర్స్ ఎండీ భేటీ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మిస్టర్ లీ

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం శ్రీసిటీలోని ఎల్జీ పాలిమర్స్ విభాగానికి చెందిన ఎండీ మిస్టర్ లీ మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, తమ ఎల్జీ పాలిమర్స్ సమాచారాన్ని వివరించారు. ఆయనతోపాటు పలువురు పారిశ్రామిక వేత్తలున్నారు.

ముగిసిన పంచాంగ నిర్మాణ జాతీయ సదస్సు



మాట్లాడుతున్న బ్రహ్మశ్రీ రాణి నరసింహమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ జ్యోతిష్య వాస్తు విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పంచాంగ నిర్మాణ జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఇందులో ముఖ్యఅతిథిగా బ్రహ్మశ్రీ రాణి నరసింహమూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నూతన శాస్త్రీయ పరిశోధనలతో నూతన పంచాంగ నిర్మాణం అవసరమని అభిప్రాయపడ్డారు. పలువురు జ్యోతిష్య విద్వాంసులు, పంచాంగ కర్తలు పరిశోధనలు చేసి వర్సిటీ ఆధ్వర్యంలో నూతన పంచాంగ నిర్మాణం చేయాలనే సంకల్పం అభినందయమన్నారు. కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ప్రొఫెసర్ రాధాకాంత ఠాకూర్, డీన్లు రజనీకాంత్ శుక్ల, కృష్ణేశ్వర ఝా, కో–ఆర్డినేటర్స్ చిత్తరంజన్ నాయక్, కృష్ణ కుమార్ భార్గవ్, బాలాత్రామ్ సారస్వత్, ధర్మదాసన్ పాల్గొన్నారు.

- తిరుపతి కొర్లగుంటకు చెందిన సురేష్ ఈ ఏడాది ఓ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అతనికి 2022–23 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ను అందించారు. రెండేళ్ల పాటు ట్యాబ్‌లోని పాఠ్యాంశాలను నేర్చుకుంటూ చదువులో ముందుండేవాడు. అయితే ఇప్పుడు ఓ మొబైల్ షాపులో ట్యాబ్ సాఫ్ట్‌వేర్‌ను అన్‌లాక్ చేయించుకుని అందులో యూట్యూబ్ ఇతర సోషల్ మీడియాను చూడడమే పనిగా పెట్టుకోవడంతో చదువులో వెనుకపడ్డాడు.
- గూడూరుకు చెందిన సోంప్రకాష్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గత ఏడాది అతనికి విద్యాశాఖాధికారులు ట్యాబ్ అందజేశారు. ట్యాబ్‌లోని బైజూస్ కంటెంట్‌తో కూడిన పాఠ్యాంశాలతో చదువులో చురుగ్గా ఉండేవాడు. కాని ఇప్పుడు ట్యాబ్‌పై పర్యవేక్షణ లేకపోవడంతో సాఫ్ట్‌వేర్‌ను అన్‌లాక్ చేయించుకుని నిత్యం గేమ్స్ ఆడుతూ చదువులో వెనుకబడ్డాడు.



రేణిగుంట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు(ఫైల్)

దృశ్య పాఠం.. దూరం

అధునాతనం.. సాంకేతికం.. ఇప్పుడు ఈ రెండే ప్రపంచమంతా వినిపిస్తున్న పదాలు. సమాజం సాంకేతికంగా దూసుకెళుతున్న నేటి తరుణంలో పేద విద్యార్థులకు ఉపయోగపడేలా.. వారికి అంతర్జాతీయ స్థాయి విద్య అందేలా గత ప్రభుత్వం డిజిటల్ బోధన అమలు చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు వాటికి మంగళం పాడింది. ప్రభుత్వ విద్యారంగాన్ని విస్మరించింది. వెరసి.. దృశ్యపాఠం దూరమైంది. పర్యవేక్షణ కొరవడి డిజిటల్ బోధనకు వినియోగించిన ట్యాబ్‌లు పక్కదారి పడుతున్నాయి. ఫలితంగా పేద పిల్లలు చదువులో వెనుకపడుతున్నారు.

- పక్కదారి పడుతున్న ట్యాబ్‌లు
- కొరవడిన పర్యవేక్షణ
- విద్యలో వెనకపడుతున్న విద్యార్థులు

తిరుపతి తిరుపతి ఎడ్యుకేషన్ : పేద విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యనందించి, వారికి బంగారు భవిష్యత్‌ను అందించేందుకు గత ప్రభుత్వం కృషి చేసింది. విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దడానికి నేటి పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ విద్యను ప్రభుత్వ స్కూళ్లకు తీసుకొచ్చింది. విద్యారంగంలో ఆన్‌లైన్ దిగ్గజమైన బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుని రూ.కోట్లు వెచ్చించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లను అందించింది. దీని ఫలితమే విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం, ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యం మెరుగుపడింది. అయితే ప్రస్తుతం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యారంగాన్ని గాలికొదిలేసింది. విద్యార్థులకు అమలు చేస్తున్న తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను నిధుల కొరత సాకుతో పక్కనబెట్టింది. ఈ ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్యాబ్‌ల సంగతే మరిచిపోయింది. అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ఇటు ప్రభుత్వ విద్యారంగాన్ని, అటు విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందంటూ తల్లిదండ్రులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

తిరుపతి జిల్లా వివరాలు...

2022–2023వ విద్యా సంవత్సరం	
ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	517
8వ తరగతి విద్యార్థుల సంఖ్య	18,829
మొత్తం ట్యాబ్‌ల పంపిణీ	21,422
మొత్తం ట్యాబ్‌ల విలువ	రూ.68.55కోట్లు
2023–2024వ విద్యా సంవత్సరం	
ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	517
8వ తరగతి విద్యార్థుల సంఖ్య	17,097
మొత్తం ట్యాబ్‌ల పంపిణీ	16,159
మొత్తం ట్యాబ్‌ల విలువ	రూ.63.83కోట్లు

గత ప్రభుత్వంలో విద్యారంగం పురోభివృద్ధి

2019లో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని పురోభివృద్ధి వైపు పరుగులు పెట్టించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించే లక్ష్యంతో అడుగులు వేస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు అందించేందుకు డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు, పాఠశాలలకు ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలను అందించేందుకు బృహత్తర ప్రణాళికను రచించడమే కాకుండా వాటిని కచ్చితంగా అమలు చేశారు. ఇందులో భాగంగానే ఆన్‌లైన్ విద్యారంగంలో దిగ్గజ సంస్థ బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులందరికీ రూ.కోట్లు వెచ్చించి శ్యాంసంగ్ ట్యాబ్‌ల్లో బైజూస్ కంటెంట్‌ను ఇంగ్లిష్, తెలుగులో నిక్షిప్తం చేసి, అందించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి రూ.68.55 కోట్లు వెచ్చించి 21,422 ట్యాబ్‌లను, 2023–24విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.63.83 కోట్లు వెచ్చించి 16,159 ట్యాబ్‌లను విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు అందించారు.

ట్యాబ్‌లోనే పాఠాలు..

విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించిన ట్యాబ్‌లో 8, 9వ తరగతులకు సంబంధించి గణితం, భౌతిక, జీవ, రసాయన శాస్త్రాలు, చరిత్ర, భూగర్భ, పౌర శాస్త్రాల సబ్జెక్టుల పాఠాలు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఉన్నాయి. పాఠశాలల్లో అనుసరించే పాఠ్యపుస్తకాల్లో అధ్యాయాల వారీగా కంటెంట్ ఇండెక్స్‌ను పొందుపరిచారు. ప్రతి అధ్యాయం కాన్సెప్ట్‌లుగా విభజించి, ప్రతి కాన్సెప్ట్‌ను 2 నుంచి 4 నిమిషాల వ్యవధితో వీడియోలుగా పొందుపరిచారు. దీంతో పాటు విద్యార్థులు ఆయా పాఠ్యాంశాలను వీడియో ద్వారా చూసి నేర్చుకోవడంతో పాటు ఎంత వరకు నేర్చుకున్నారో ప్రశ్నపత్రాల ద్వారా తమను తాము పరీక్షించుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా మెరుగైన అభ్యసన సామర్థ్యాన్ని ఎవరికి వారే పెంపొందించుకోవడానికి దోహదం పడింది.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ..

గత ప్రభుత్వం అందించి ట్యాబ్‌లను కేవలం బైజూస్ కంటెంట్‌కే పరిమితం చేసింది. ఇంటర్నెట్‌తో నిమిత్తం లేకుండా ఇందులోని పాఠ్యాంశాలను చదవవచ్చు అలాగే వీడియోలను చూసేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడంతో యూట్యూబ్, గేమ్స్, వాట్సాప్ వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే వీలు లేకుండా జాగ్రత్త పడింది.

నేడు పరిస్థితి భిన్నం

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి నాలుగు నెలల గడుస్తున్నా ఇంతవరకు ట్యాబ్‌ల ఊసేలేదు. ఉన్న ట్యాబ్‌లపై పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వాటిని పక్కదారి పట్టిస్తున్నారు. ఇందులో ఉన్న సాఫ్ట్‌వేర్‌ను మొబైల్ షాపుల్లో అన్‌లాక్ చేయించుకుంటున్నారు. ఇందులో గేమ్‌లు, యూట్యూబ్, వాట్సాప్ తదితర యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని, వాటితో ఎక్కువ సమయం గడుపుతుండడంతో చదువులో వెనుకపడుతున్నారు.



ట్యాబ్‌లు చూపుతున్న రేణిగుంట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు (ఫైల్)

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

“విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో అందించిన ట్యాబ్‌లను ఇప్పటికీ విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వాటిలోని కంటెంట్‌ను చదువుకుంటూ విద్యాప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారు. ట్యాబ్‌లు ఎక్కడా దుర్వినియోగం కాలేదు. దుర్వినియోగం చేసినట్లు తమ దృష్టికి వస్తే వాటిని వెనక్కితీసుకుంటాం. – డాక్టర్ వి.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి



చెంచయ్య మృతిపై పోస్టుమార్టం నివేదిక ఇవ్వండి

- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళతో మాట్లాడున్న సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన బండి చెంచయ్య అనుమానాస్పద మృతిపై వైద్యుల బృందంతో పరిశీలన చేసి, పక్కాగా పోస్టుమార్టం నివేదికను ఇవ్వాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళతో సంజీవయ్య మాట్లాడారు. మృతుని కుటుంబ సభ్యులు చెంచయ్యను కక్షపూరితంగానే హత్య చేసినట్లు చెబుతున్నట్లు తెలిపారు. చెంచయ్య మృతికి సంబంధించిన కారణాలను క్షుణంగా తెలుసుకోవాలని వైద్యులకు సూచించారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోస్టుమార్టంలో మృతికి గల కాణాలను తెలుసుకుని నిగ్గు తేల్చాలన్నారు. అలాగే పోలీసులు కూడా పక్కాగా దర్యాప్తు చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నాలుగు రోజులు కిందట కామిరెడ్డి సత్యనారాయణ ఇంటి వద్దకు రాత్రి సమయాల్లో మారణాయుధాలతో వచ్చి దుర్మార్గంగా వ్యవహరించి, చంపేందుకు వచ్చిన టీడీపీ వారిపై హత్య నేరం కేసు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును సంజీవయ్య తీవ్రంగా ఖండించారు. తమ పార్టీకి చెందిన వ్యక్తి మృతికి సంబంధించి నిజాలను వెలికితీయాలని సంజీవయ్య డిమాండ్ చేశారు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల వద్ద మాజీ ఎమ్మెల్యేతో పాటు ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, శేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఒట్టూరు కిషోర్ యాదవ్, బైనా మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్, పాదర్తి హరినాథ్ రెడ్డి, కింగ్స్‌వే జిలానీ, పేర్నాటి రాహుల్, మీజూరు బాల, నిడిగింటి చిట్టిబాబు, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

లింగ వివక్ష వద్దు



బహుమతులు పొందిన విద్యార్థులతో డీఆర్వో, అధికారులు

తిరుపతి అర్బన్: లింగ వివక్ష చూపవద్దని, ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాల్సి ఉందని జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం బేటీ బచావో–బేటీ పడావో(బాలికను రక్షించండి– బాలికను చదివించండి) జిల్లా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ శిశులింగ నిష్పత్తిని పెంచడం, ఆడ పిల్లలను రక్షించి, చదివించాలన్నదే బేటీ బచావో బేటీ పడవో పథకం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. మహిళా హత్యలు, బాల్య వివాహాలను అరికట్టడంలో అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. ఆడ పిల్లలు పుట్టడం అనేది అదృష్టంగా భావించాలని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను పెంచాలని సూచించారు. ముఖ్యంగా స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఏ బిడ్డ పుడతాడో ముందుగానే తెలుసుకోవడానికి ప్రయత్నం చేయకూడదని తెలిపారు. వైద్య విభాగం నేతృత్వంలో విద్యార్థులకు బేటీ బచావో–బేటీ పడావో పోటీలు నిర్వహించి నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు ఇవ్వడంతోపాటు ప్రశాంసాపత్రం అందజేశారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ, సాధికారత అధికారి జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత పాల్గొన్నారు.

కాన్పులెందుకు చేయలేదు?



వైద్యులు,సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- పీహెచ్‌సీ వైద్యులపై కలెక్టర్ ఆగ్రహం

దక్కిలి: పీహెచ్‌సీలో కాన్పులు ఎందుకు చేయలేదని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వైద్యులను ప్రశ్నించారు. దక్కిలి పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆస్పత్రిలో అన్ని వైద్య సేవలు అందించే గదులు, రోగులు ఉండే వార్డులు, కాన్పుల గదులను పరిశీలించారు. మండలంలో గర్భిణుల వివరాలు నమోదు చేసిన రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందితో బాలింతలకు ఫోన్ చేయించి, ఎక్కడ ఉన్నారు.. ఎలా ఉన్నారు.. క్షేమంగా కాన్పులు జరిగాయా? అని ఆరా తీశారు. వారి పనితీరును పరిశీలించిన కలెక్టర్ ఇలా అయితే పేదలకు ఎలా వైద్య సేవలు అందిస్తారని ప్రశ్నించారు. గర్భిణులకు కాన్పులు నిర్వహించే గది ఉన్నా, ఆ గదిని కూడా పరిశుభ్రంగా ఉంచాలన్న ఆలోచన లేకుండా మీరేమి విధులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.

పనితీరు మార్చుకోవాలి

దక్కిలి పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు పనితీరు పూర్తి స్థాయిలో మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. పీహెచ్‌సీని పూర్తిగా పరిశీలించిన ఆయన అక్కడ పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు మెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మెమోలుతోనే సరి పెడుతున్నామనుకుని పనితీరు మార్చుకోకపోతే మాత్రం తగు చర్యలు తీసుకుంటామన్నారు. దక్కిలి పీహెచ్‌సీకి తన భార్యను కాన్పు కోసం తీసుకు వస్తే ఇక్కడ పని చేస్తున్న వైద్యులు నిర్లక్ష్యం కారణంగా ఆమె చనిపోయిందని దక్కిలి గ్రామానికి చెందిన యలకచర్ల శ్రీనివాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో విచారణ కమిటీ వేసినా వైద్యులు ఆ కమిటీని తప్పుదోవ పట్టించి తమకు అన్యాయం చేశారని వాపోయారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు, వైద్యాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

వివాదంలో వికృతమాల భూములు

- ఒకరి పేరున ఉన్న భూములు ఇంకొకరి పేరుతో కొనుగోలు
- నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన ప్రైవేటు సంస్థ
- ఆ భూములను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని గతంలో రెవెన్యూశాఖపై ఒత్తిళ్లు
- తాజాగా రిజిస్ట్రేషన్ చేయాలంటూ టీడీపీ నేత ఒత్తిడి
- ఏం చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్న అధికారులు



రిజిస్ట్రేషన్ కోసం టీడీపీ నేత ఒత్తిడి చేస్తున్న భూములివే

సాక్షి టాస్క్‌ఫోర్స్: నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన భూములను రిజిస్ట్రేషన్ చేయాలంటూ టీడీపీ నేత అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయకపోతే బదిలీ తప్పదని హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. విశాఖపట్టణానికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ తక్కువ ధరకే భూములు ఇప్పిస్తామంటూ నమ్మించి, రాష్ట్రవ్యాప్తంగా డిపాజిట్ల రూపంలో భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. డిపాజిట్లు చెల్లించిన వారిలో తిరుపతి జిల్లాకు చెందిన వారు అనేక మంది ఉన్నారు. గత కొన్నేళ్ల నుంచి రూ.కోట్ల రూపంలో డిపాజిట్లు సేకరించినా..లబ్ధిదారులకు భూములు చూపించలేదు. డబ్బులు కట్టిన వారంతా ఆ సంస్థపై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఒత్తిళ్లు, కేసులు తట్టుకోలేక ఆ ప్రైవేటు సంస్థ 2007లో ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలో సుమారు 20 ఎకరాలను భూములు కొనుగోలు చేసింది. ఈ భూములు కొనుగోలు చేసిన వ్యక్తుల్లో టీడీపీకి చెందిన నాయకుడు కూడా కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. అయితే ఆ భూములను యజమానిని నుంచి కొనుగోలు చేయకుండా.. వారి వారసుల నుంచి కొనుగోలు చేశారు. అనంతరం ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అధికారులు చుట్టూ తిరిగారు. మరో వైపు రెవెన్యూ అధికారులపైనా ఒత్తిడి చేశారు. రెండేళ్ల క్రితం కూడా రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయించారు. వికృతమాల రెవెన్యూ పరిధిలో ఇప్పటికే భూ వివాదాలు అధికంగా ఉండడంతో అధికారులు సాహసించలేకపోయారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఒత్తిళ్లు

జిల్లాలో రూ.20 కోట్లకు పైగా డబ్బులు కట్టిన బాధితులు గగ్గోలు పెడుతున్నారు. అయితే ఖాతాదారులకు ఇవ్వాల్సిన భూములను బినామీ పేర్లతో మార్చేందుకు భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సన్నాహాలు చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం వికృతమాలలో ప్రైవేటు సంస్థ ఖాతాదారుల కోసం కొనిన భూములను వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు సన్నాహాలు చేశారు. బఫర్‌జోన్, కాలువలు, డీకేటీ భూములు కలుపుకుని లేఅవుట్ వేశారు. లేఅవుట్‌లో చూపించి, అమ్మేందుకు సన్నద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఎనిమిది నెలల ముందు నుంచే ఈ భూములు అమ్మేందుకు చలానాలు కట్టి రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అందుకు రిజిస్ట్రార్ అంగీకరించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకుడు ఆ భూములను అధికారులు అండదండలతో కాలువలు, డీకేటీ భూములు, బఫర్‌జోన్ పక్కన ఉన్న ఇతర పొలాలను కలుపుకుని బినామీ పేర్లతో మార్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. విషయం తెలుసుకున్న బాధితులు ప్రైవేటు సంస్థపై సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్‌ను వివరణ కోరగా ప్రస్తుతం వెల్ఫేర్ భూములు ఏవీ రిజిస్ట్రేషన్ చేయలేదని, అందుకు సంబంధించి ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు.

క్లుప్తంగా

గ్రానైట్ లారీ సీజ్



సీజ్ చేసిన గ్రానైట్ లారీ

చంద్రగిరి: నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న గ్రానైట్ లారీని మంగళవారం అర్ధరాత్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేసినట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హోసూరుకు గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీని జాతీయ రహదారిపై అధికారులు తనిఖీ చేశారు. పరిమితికి మించి లోడింగ్ ఉండడంతో వాహనాన్ని సీజ్ చేసి, స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,359 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,711 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవం



ముద్దాయి నాగేష్‌తో పోలీసులు

వరదయ్యపాళెం: తన భార్యతో వివాహేతర సంబంధం నడిపిన యువకుడిని హత్య చేసిన కేసులో నిందితుడికి శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించినట్లు కేవీబీపురం ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కేవీబీపురం మండలం దిగువ పూడి గ్రామానికి చెందిన వంశీకృష్ణ (19) అదే గ్రామంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ఆ మహిళ భర్త గుంగి నాగేష్ (30) అటవీ ప్రాంతంలో అతికిరాతకంగా యువకుడు వంశీకృష్ణను హతమార్చాడు. ఈ ఘటన 2019 ఫిబ్రవరి 7న జరిగింది. దీనిపై కేవీబీపురం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు గుంగి నాగేష్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్ బుధవారం తీర్పును వెల్లడించారు. కేసు నేర నిరూపణకు చొరవ చూపిన దర్యాప్తు అధికారి అప్పటి సీఐ దైవప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరరాఘవరెడ్డి, కోర్టు లైజిన్ ఆఫీసర్ గోపాల్‌రాజు, హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథం, కానిస్టేబుల్ దామోదరం, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటప్ప, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

ఇంకెన్ని చావులు చూడాలి?



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు



మృతుడు రాజేంద్ర



బాలుడు చైతన్య మృతదేహం



చికిత్స పొందుతున్న గురవమ్మ

- ఇసుక ట్రాక్టర్ ఢీకొని తండ్రీ, కొడుకులు దుర్మరణం
- శోకసంద్రమైన చియ్యవరం
- ఊరు, ఊరంతా ఆస్పత్రికి చేరుకుని రోదనలు
- నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో ఇసుకాసురుల దాహానికి మరో రెండు ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. నియోజకవర్గం వెంబడి ఉన్న తెల్లబంగారాన్ని కొల్లగొట్టి స్వర్ణమ్మ ఆత్మఘోషకు కారణమవుతున్న పచ్చనేతల ఇసుక దాహానికి ఇంకెన్ని ప్రాణాలు బలికావాలోనని సామాన్య ప్రజలు ఘోషిస్తున్నారు. బుధవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెం సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఓ కుటుంబాన్ని ఇసుకాసురులు గుద్ది చంపారు. తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన రాజేంద్ర, అతని భార్య గురవమ్మ, కుమారుడు చైతన్యకు ఆరోగ్యం బాగోలేక, శ్రీకాళహస్తికి వచ్చి వైద్యం చేయించుకుని తిరిగి వెళుతుండగా మృత్యువు వారిని ఇసుక ట్రాక్టర్ రూపంలో వెంటాడి బలి తీసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రీకుమారులిద్దరూ మృతి చెందగా, గురవమ్మకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఏరియా ఆస్పత్రిలో ఆర్తనాదాలు


ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న చియ్యవరం గ్రామానికి చెందిన మృతుల కుటుంబ సభ్యులు, బంధువులే కాకుండా గ్రామానికి చెందిన వారంతా శ్రీకాళహస్తి పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి చేరుకుని గుండెలు బాదుకుంటూ రోదించారు. ఇంకెన్ని ప్రాణాలు గాల్లో కలిపి రక్తపు కూడును కాసులుగా మార్చి జేబులు నింపుకుంటారని ఇసుకాసురులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోని తీసుకున్నారు.

రాత్రి, పగలు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఈ నదిలోని స్వర్ణమ్మను కొల్లగొట్టి రూ.కోట్లు గడించేందుకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తన అనుచరులతో అధికారంలోకి వచ్చిన వారం రోజులకే ఇసుక అక్రమ రవాణాకు తెర తీశారు. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీల ద్వారా ఇసుకను చెన్నై, బెంగళూరులకు తరలిస్తున్నారు. దీనిపై సాక్షి పలు సార్లు కథనాలు ప్రచురించినా ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం మానేశారు. దీనికితోడు సాక్షాత్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవద్దు.. అంటూ బహిరంగంగా ప్రకటించడంతో తెలుగు తమ్ముళ్లు మరింత రెచ్చిపోయి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. గతంలో ఎనిమిదేళ్ల కిందట ఏర్పేడులో లారీ ఢీకొని 16 మంది రైతులను బలితీసుకున్న ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. టీడీపీ అధికారంలోకి రాగానే, నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ, గ్రామాల్లోని ఇరుకైన రోడ్లలో కూడా ఇసుక ట్రాక్టర్లు రయ్.. రయ్‌మంటూ వేగంగా దూసుకెళుతున్నాయి. దీంతోనే ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారో.. లేదో వేచి చూడాలి.

మెరుగైన వసతులు కల్పించండి

- ఈఓ శ్యామలరావు



శ్రీకపిలేశ్వరాలయంలో పుష్కరిణిని పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ జె.శ్యామలరావు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయానికి రానున్న కార్తీకమాసంలో విశేష సంఖ్యలో విచ్చేయనున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. టీటీడీ ఈఓ బుధవారం సాయంత్రం శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓ ఆలయం ముందు ఉన్న శ్రీఆంజనేయస్వామి వారి ఆలయం, కల్యాణకట్ట, తిరుమల శ్రీవారి లడ్డుప్రసాదాల విక్రయశాల, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, పుష్కరిణి, క్యూలైన్లు పరిశీలించి, శ్రీకామాక్షి సమేత శ్రీకపిలేశ్వరస్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం టీటీడీ పంచగవ్య ఉత్పత్తులు, అగరబత్తుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆలయంలో పారిశుద్ధ్యం, క్యూల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అందిస్తున్న సౌకర్యాలను గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, డీఎఫ్ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడు అరెస్టు

- రూ.20 లక్షలు సొత్తు స్వాధీనం



నిందితుని అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: విలాసాలకు అలవాటు పడి చోరీలు వృత్తిగా ఎంచుకున్న పాత నేరస్తుడిని శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.20 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ల్యాప్‌టాప్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ నరసింహమూర్తి మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ, రేణిగుంట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల తాళాలు వేసిన ఇళ్లల్లో వరుస చోరీలు జరిగాయి. పెద్ద ఎత్తున బంగారం, వెండి, నగదు, ఎలక్ట్రానిక పరికరాలు చోరీ జరిగాయి. ఈ ఘటనలపై ఆయా పోలీస్‌స్టేషన్ల యంత్రాంగం నిఘా పెట్టింది. ఈ క్రమంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాలను అంగీకరించాడు. తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన భరద్వాజన్ ప్రేమ్‌కుమార్ అలియాస్ కుమార్(30)గా గుర్తించారు. నిందితుడి వద్ద 220 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.180 కిలోల వెండి, లాప్‌టాప్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు కుమార్‌పై ఇది వరకే చెన్నైలోని పలు పోలీస్‌స్టేషన్లలో 20కి పైగా చోరీ కేసులు నమోదై ఉన్నాయని, పలు కేసుల్లో జైలుశిక్ష అనుభవించాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐలు గోపి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, ఏఎస్ఐలు గంగయ్య, చక్రవర్తి, కానిస్టేబుళ్లు హేమాద్రి, రవి, ప్రసాద్, కేశవన్, బాలకృష్ణ, గంగాధరాన్ని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య, రూరల్ సీఐ రవి నాయక్ పాల్గొన్నారు.

నారాయణాద్రిలో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న ఆస్టర్ నారాయణాద్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో అరుదైన మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్(ఎంఐసీఎస్) శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు సీటీవీఎస్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పి.త్రిలోక్ తెలిపారు. బుధవారం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో తమ ఆస్పత్రికి వచ్చిన తిరుపతికి చెందిన రమణయ్యకు ఆధునిక పద్ధతిలో ఎలాంటి కోతలు లేకుండా ఆధునిక వైద్యటెక్నాలజీ ద్వారా సర్జరీని విజయవంతంగా చేశామన్నారు. ఎంఐసీఎస్ పద్ధతితో ఎలాంటి భయం ఉండదని, అంతేకాక పేషెంట్ త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. ఇలాంటి శస్త్ర చికిత్సలు తిరుపతి, పరిసర ప్రాంతాల్లో మునుపెన్నడూ జరగలేదని, ప్రస్తుతం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ వి.సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అడ్వాన్స్‌డ్ సర్జరీలు చేయడానికి అవసరమైన వైద్య బృందం తమ హాస్పిటల్‌లో అందుబాటులో ఉండడం, తిరుపతి, పరసర ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరమని తెలిపారు. ఇలాంటి అడ్వాన్స్‌డ్ సర్జరీల కోసం చెన్నై, బెంగళూరు వెళ్లనవసరం లేదని, ప్రస్తుతం తమ హాస్పిటల్‌లో ప్రత్యేక వైద్య బృందంతో ఇలాంటి అరుదైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌ముని, మరో డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ.ప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ పి.ప్రతిమ పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

- ఉబ్బలమడుగులో యువకుడు మృతి

వరదయ్యపాళెం: తన స్నేహితుడితో సరదాగా విహారయాత్రకు వచ్చిన ఓ యువకుడు జలపాతంలో దిగి మృతి చెందిన ఘటన బుధవారం ఉబ్బలమడుగులో చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన భరత్ కుమార్ (19) బుధవారం తన స్నేహితులతో కలిసి సరదాగా విహారయాత్ర నిమిత్తం ఉబ్బలమడుగు సందర్శనకు వచ్చాడు. ఈత తెలియని భరత్ కుమార్ జలపాతంలో దిగడంతో అక్కడ లోతు ఎక్కువగా ఉన్న కారణంగా యువకుడు నీటిలో మునిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంట వచ్చిన స్నేహితులు బీఎన్‌కండ్రిగ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యువకుడిని చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించే లోపు మార్గం మధ్యలో యువకుడు భరత్ కుమార్ మృతి చెందాడు. మృత దేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ నాయుడు పేర్కొన్నారు.

విద్యల్లో వేదవిద్య ఉన్నతం

- కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి

తిరుమల: అన్ని విద్యల్లో కన్నా వేదవిద్య ఉన్నతమైనది కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. తిరుమలలోని ఎస్వీ వేద విజ్ఞాన పీఠంలో బుధవారం సాయంత్రం ఆయన వేద విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ వేద విద్యార్థులు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేదాలు అభ్యసించే విద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యమని చెప్పారు. ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరని తెలిపారు. భారతదేశం సాధువులు, మహర్షులతో నడుపుతున్న దేశమని తెలిపారు. మనం ధర్మం కోసం త్యాగం చేయాలి గానీ ధర్మాన్ని త్యాగం చేయకూడదని పేర్కొన్నారు. వేదాల్లోని భావార్థం విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే భావి తరాలకు మంచి జరుగుతుందని చెప్పారు. ధర్మ పరిరక్షణకు ఆహార, ఆలోచన నియామాలు పాటించాలని తెలిపారు. విద్యార్థులందరూ వేదవిద్య పూర్తయ్యాక ధర్మానికి కార్యకర్తలుగా పనిచేసి, సంస్కృత భాషను ప్రచారం చేయాలని సూచించారు. మన దేశానికి ధర్మం, ఆలయం, సంస్కృతి, ఆచారం ముఖ్యమని ఉపదేశించారు. దేశంలోని ప్రతి గ్రామంలో ఉన్న ఆలయాలను తిరుమల ఆలయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేస్తున్న అనేక కార్యక్రమాల్లో వేద విజ్ఞాన అభివృద్ధి కార్యక్రమం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ క్రీడా మైదానంతో వ్యాపారమా?

- ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసనలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలపాలని డిమాండ్
- ఎస్వీయూ చరిత్రలో ఇదే ప్రథమం



తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి అర్బన్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో క్రీడామైదానాన్ని కమర్షియల్ కార్యక్రమానికి అద్దెకు ఇచ్చి వ్యాపారం చేయడం ఏమిటని విద్యార్థి సంఘం నేతలు మండిపడ్డారు. బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్ష విద్యార్థి సంఘాల నేతలు ఓబుల్‌రెడ్డి, కిషోర్ దాస్ మాట్లాడుతూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, ఈ విషయంపై లోతైన విచారణ జరిపించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సాంస్కృతిక కార్యక్రమానికి యూనివర్సిటీ అధికారులు స్టేడియంను అద్దెకు ఇవ్వడం పూర్తిగా కమర్షియల్ కార్యక్రమంగా పేర్కొన్నారు. కమర్షియల్ కార్యక్రమానికి యూనివర్సిటీ స్టేడియాన్ని అద్దెకివ్వడం అనేది అనైతికంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు భారీ ఎత్తున అవినీతికి పాల్పడి, యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఈ కార్యక్రమం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమానికి స్టేడియంలో ఎంట్రీ ఫీజు రూ.8 వేలు ఉండడం ఇలాంటి కమర్షియల్ కార్యక్రమానికి పవిత్రమైన యూనివర్సిటీ స్టేడియం కేంద్రం కావడం బాధాకరమన్నారు. ఈ దారుణానికి పాల్పడిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంపై విచారణ జరిపించాలని కోరారు. యూనివర్సిటీ చరిత్రలో ఎప్పుడూ మైదానాన్ని ఇంత భారీ ఎత్తున కమర్షియల్ కార్యక్రమానికి అనుమతి ఇవ్వలేదని, కేవలం రిజిస్ట్రార్ తమ స్వలాభం కోసం, భారీ ఎత్తున అవినీతికి పాల్పడి యూనివర్సిటీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, అలాగే యూనివర్సిటీ మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో మహిళలను కించపరుస్తూ పాటలు పడే అవకాశం ఉందని, ఎవరైనా మత్తు మందు సేవించి ఈ కార్యక్రమానికి వస్తే యూనివర్సిటీలో ఉన్న శాంతియుత వాతావరణం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఆ మేరకు ఆర్డీఓ రామ్మోహన్‌కు ఓ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి అఖిలపక్ష విద్యార్థి నాయకులు వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, రావూరు హరికృష్ణ రాయల్, మహేంద్ర నాయక్, శ్రీనివాసులు, రామకృష్ణ , ఆవుల పవన్ కుమార్ యాదవ్, ముబారక్, నందకిషోర్ , రవికుమార్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య

- బండరాయితో తలపై మోది చంపిన వైనం
- నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్న పోలీసులు



మృతుడు ఈశ్వరయ్య, అతని భార్య సుజాత(ఫైల్)

రేణిగుంట: మండలం కరకంబాడి సమీపంలోని చెంగారెడ్డిపల్లి దళితవాడలో మంగళవారం అర్ధరాత్రి దాటాక, భర్తను కట్టుకున్న భార్య బండరాయితో తలపై మోది హతమార్చింది. స్థానికంగా ఈ ఘటన కలకలం సృష్టించింది. రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర కథనం మేరకు.. రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లి దళితవాడలో కె.ఈశ్వరయ్య(45), సుజాత భార్యభర్తలు నివాసమున్నారు. వారికి నలుగురు పిల్లలున్నారు. వారిలో పెద్ద కుమార్తె కె.రేఖకు వివాహం అయ్యింది. కె.తేజ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. మాధురి పదో తరగతి, సోమశేఖర్ ఏడో తరగతి చదువుతున్నారు. సుజాత కూలి పనులకు వెళుతుండగా, ఈశ్వరయ్య సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో హౌస్‌కీపింగ్ పని చేస్తూ, కొంత కాలం కిందట నిలిచిపోయాడు. అప్పటి నుంచి ఖాళీగానే ఉంటూ తరచూ మద్యం తాగేవాడు. ఈ క్రమంలో దంపతుల నడుమ గొడవలు జరుగుతుండేవి. మంగళవారం రాత్రి పిల్లలు ముగ్గురు ఇంట్లో నిద్రిస్తుండగా, ఈశ్వరయ్య అతని భార్య సుజాత మిద్దెపైన నిద్రించారు. అయితే వారి మధ్య ఏమి జరిగిందో తెలియదు.. రాత్రి 12 గంటల సమయంలో భార్య,భర్తల మధ్య గొడవ జరిగడంతో ఆమె పక్కనే ఉన్న బండరాయి తీసుకుని భర్త ఈశ్వరయ్య తలమీద బలంగా మోదింది. దీంతో ఈశ్వరయ్య కుప్పకూలిపోయాడు. అయితే విషయం తెలుసుకున్న బంధువులు అతన్ని చికిత్స నిమిత్తం కరకంబాడిలోని అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద కళాశాలకు తరలించారు. అయితే కట్టుకున్న భార్యే భర్తకు కిరాతకంగా చంపడానికి దారితీసిన కారణాలపై స్థానికులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. తల్లి చేతిలోనే తండ్రి మరణించడంతో పిల్లలు తీవ్రంగా విలపిస్తున్నారు. నిజానిజాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన మణి



లారీ కింద పడి మృతి చెందిన మంజు

చంద్రగిరి(తిరుచానూరు): రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి తనపల్లి క్రాస్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ ఇళ్లకు చెందిన మంజు(28), మణి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మంజు అన్న ఇంటి వద్ద చిల్లర దుకాణం నడుపుతున్న క్రమంలో బుధవారం దుకాణ సామగ్రి కోసం ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళ్లారు. సామగ్రి తీసుకుని తిరుగు ప్రయాణంలో తనపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా చంద్రగిరి నుంచి రేణిగుంట వైపునకు వెళుతున్న లారీ, మోటార్ సైకిల్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ లారీ కింద ఇరుక్కుపోయి వాహనం నడుపుతున్న మంజు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి మణి తీవ్ర గాయాలతో లారీ కింద ఇరుక్కుపోవడంతో స్థానికులు బయటకు తీశారు. వెంటనే స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించారు. మణి పరిస్థితి విషమంగా ఉంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు దర్యాప్తు చేస్తున్నారు.